


# సంపాదకునికి లేఖ

*17-9-77 తేది ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో శ్రీ చిత్రకుల పురుషోత్తంగారి 'పిలుపు' కథ చదివి..ఆ కథ పాత్ర జీవం పోసుకుని వస్తే*

"ఆర్యా,

మీ పత్రికలో ప్రచురితమైన 'నా' కథ చదివాక ఈ ఉత్తరం వ్రాయకుండా ఉండలేక పోతున్నాను. ఆ కథలో కథానాయికను నేనే. కాకపోతే నా పేరు మాత్రం మారింది.

కథానాయిక సువర్చల ఇంజనీరును పెళ్లి చేసుకున్నదనీ, గోపాలరావు కూడా మరో అమ్మాయితో పెళ్లికి ఒప్పుకున్నాడనీ కథ ముగించారు.

సామాన్యంగా మన కథలన్నీ పెళ్లితో ముగిసిపోతాయి. అంటే చాలామంది రచయితల అభిప్రాయం— పెళ్లయిపోతే ఇక జీవితంలో సమస్యలేవీ ఉండనట్టు, అన్ని సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టేసినట్టు.... నిజానికి పెళ్లితోనే అసలు సమస్యలు మొదలవుతాయని రచయిత (త్రు)లు గ్రహించాలి. దీనికి దృష్టాంతం నా కథే.

మా మాస్టార్ని నేను ప్రేమించాను. ఆయన మా పెండ్లి విషయం మానాన్నగారిని అడుగుతాననగానే ఒప్పుకున్నాను. కానీ మానాన్నగారు ఆస్తికీ, అంతస్తుకూ విలువనిచ్చారు. "బ్రతకలేక బడిపంతులు" అన్నారు. "నీకు రాజాలాంటి సమ్బంధం తెస్తానమ్మా, పెద్దవాళ్ల మాట తోసివేయకు" అన్నారు.

నన్ను ఆ సమయంలో ఏ జ్యేష్ఠాదేవో కమ్మింది. అన్నిటికీ ఒప్పుకున్నాను. వాళ్లను ఎదిరించలేక పోయాను.

కానీ మాస్టారుగారి పట్ల ప్రేమపాశం లేకపోలేదు, నా మనస్సులో.

అందుకే పెళ్లికొడుకు తండ్రి డబ్బు కోసం పేచీ పెట్టగానే, మాస్టారు దగ్గరకు పరుగెత్తు కెళ్లాను.

"మాస్టారూ! వాళ్లు రాక్షసులు, పెళ్లికొడుక్కి వ్యక్తిత్వం లేదు" అని వాళ్లను తిట్టాను. కానీ మాస్టారు కరిగి పోలేదు.

"నేను అతన్ని పెళ్లాడను" అన్నాను ఏం చేయాలో మీరే చెప్పా లన్నాను.

ఆయన ఏ మాలోచించారో—"ఈ ముహూర్తానికే నీ పెళ్లి జరిగి తీరుతుంద"ని, వెంటనే లేచి బయటికి వెళ్లి పోయారు.

నా ఉద్దేశం— ఆయన నన్ను పెళ్లి చేసుకుంటారని. కానీ జరిగింది వేరు.

పెళ్లి వారికివ్వవలసిన పదివేల రూపాయలు తెచ్చి ఇచ్చి పెళ్లి జరిపించమనగానే నాకు ఆశ్చర్యం కలిగింది. పెళ్లికొడుకు పట్ల అసహ్యం, ద్వేషం కలిగాయి. గుండెలో చెలరేగిన మంట కళ్లలో ప్రతిఫలించింది. కానీ మాస్టారుగారి కళ్లలోకి చూడగానే, ఏ శక్తులు ప్రేరేపించాయో ఏరి నా కోపం చల్లారి పోయింది.

**భాస్కర స్వర్ణాంబ**

పెళ్లి జరిగిపోయింది.

ఇదంతా మీకు తెలిసిందే. ఆ తర్వాత కథే చదవాలి మీరు.

నేను అత్తగారింటికి వెళ్లిన తర్వాత ఒకరోజు ఆయన దూకుడుగా నాగదిలోకి వచ్చారు.

ఈకొద్దిరోజుల్లో ఆయన్ని పూర్తిగా అర్థం చేసుకున్నాను. ఆయన తండ్రి చాటు బిడ్డ. అనుమానాల పుట్ట. వ్యక్తిత్వంలేని మనిషి. చదువుకొన్న మూర్ఖుడు మొగుడ్ని ఇలా అన్నందుకు నాకు పతివ్రతల లిస్టులో చోటుండక పోవచ్చుగానీ, ఇవి నిజాలు.. సరే ప్రస్తుత కథ— ఆయన వస్తూనే "నీకూ,గోపాలరావుకూ ఏమిటి సంబంధం" అని అడిగారు.

"ఆయన మా మాస్టారు. మా ఏదురింట్లో ఉండేవారు" అన్నాను.

"అంతేనా? ఇంకేమీ లేదా? నీవు అతని దగ్గర ట్యూషన్‌కు వెళ్లేదానివి కదూ?"

"అవును. ఏదైనా అర్థం కాకపోతే వెళ్ళి చెప్పించుకునే దాన్ని."

"అతను నిన్ను ప్రేమించాడు కదూ?

"ఏమో, ప్రేమించి ఉండవచ్చు అది నా తప్పుకాదు."

"ఓహో! మాటలు బాగా నేర్చావ్ను మాట! ప్రేమించడం తప్పుకాదు. పెళ్ళి కూతురు పీటల మీదనుండి లేచిపోయి ఇంకొకరింట్లో పెత్తనాలు చేయడం తప్పుకాదు. పరాయి మగవాడు పదివేల రూపాయలు అప్పు తెచ్చిఇచ్చి పెళ్లి జరిపించడమూ తప్పుకాదు. నిజం చెప్పు— అతనికీ, నీకూ ఏమీ సంబంధం లేక పోతే అతను నీ పెళ్లికి ఎందుకు సాయం చేయాలి? చెప్తాడు?"

"అతనికీ, నాకూ, సంబంధం ఉంటే పెళ్లే జరిగి ఉండేది. డబ్బు అప్పు ఎందుకు తెచ్చిస్తాడు? ఒక ఆడపిల్ల పెళ్లి పీటలమీద ఆగిపోతే మళ్లీ ఆ అమ్మాయి జీవితం ఏం కావాలి? ఆ దుర్భరమును కొని, ముందొక మాట చెప్పి మళ్లీ ఆ మాట తప్పినారి నేమనాలి? ఒక ఆడపిల్ల జీవితంతో చెలగాటం ఆడితే తప్పులేదు. ఒక పెద్దమనిషికి నను గురించి అపవాదాలు తెస్తే తప్పులేదు. కానీ ఆ ఆడపిల్ల ఏ మాటకోసో పడ కూడా కాపాడు పెద్ద మనిషిది తప్పు ఆ పిల్ల సంసారం నిలబెట్టడం తప్పు. కదూ...?"

ఇవన్నీ నే నతనితో చెప్పలేదు. చెప్పాలని మనసులో అనుకున్నాను. చెప్తేనా బాగుండేది. కానీ కొత్త పెళ్లికూతుర్ని. కొత్త వాతావరణం. ఏదో భయం నన్నావరించింది. అందువేత నోట మాట రాక అలా నిలబడి పోయాను తలవంచుకొని. ఆయన నా మౌనాన్ని అపార్థం చేసుకొన్నారు. ఇంకా ఏమిటో అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత తెలిసింది, ఆయన కోపానికు కారణం ఏమిటో!

పెళ్లి జరిగిన నాడే ఈ విషయం నిర్ధిరింట్లో చర్చకు వచ్చిందట! అవా కూ, దురూ కేదీ కొందరు దీన్ని గురించి చెప్పుకున్నారట!

పెళ్లికూతురు అతనితోనే పెళ్లి ఎందుకు మాట్లాడిందీ అని ఒకరి అనుమానం.

ఆ అబ్బాయి ఈ పిల్లను చేసుకోవా లనుకున్నాడట. కానీ ఆస్తిలేదని పిల్ల తండ్రి ఒప్పుకోలేదట—మరొకరి సమాధానం.

అసలు ఆ అమ్మాయిని, ఇక ఈ పెళ్ళి చేసుకోను అంటే, ఆ కొత్తదరే డబ్బు తెచ్చి ఇచ్చి పెళ్లి జరిపించాడట—వేరొకరి వ్యాఖ్యానం.

"మొత్తానికి ఆ అబ్బాయి, ఈ అమ్మాయిని ప్రేమించాడు కాబట్టి ఇంతగా కలగజేసుకొన్నాడు వీళ్ల వి.. యంలో. వాలకం చూస్తే తెలీడంలా ఇంతసేపలా ఆ ప్రేమమూ, ఆ గడ్డమూ"

ఇలాంటి మాటలు వినిపించారుట. గోడలకు చెవులు. ఆ చెవి మరో చెవిలో వేసింది. ఆఖరికి ఎవరికీ తెలియాలో వారికే తెలిసింది.

అవును. పెళ్లికి వచ్చిన వాళ్లు అక్షింతలే కాదు, ఇలాంటి మాటల్నీ విసురుతారు అప్పుడప్పుడూ. ఎటొచ్చీ అక్షింతల వల్ల ఆశీస్సులు రాలకపోయినా, మాటల వల్ల కొంపలు కూలుతాయి ఒక్కోసారి. అలా ప్రారంభమయ్యాయి మా ఇద్దరి మధ్య కలతలు. కొత్తలో నేను మాట్లాడే దాన్ని కాదు. కాస్త తర్వాత ఈ మాటలు ఈటెల్లా భరించలేక నేనూ కొన్ని అన్నే దాన్ని. మెల్లి మెల్లిగా ఆఖరికి దశకు చేరుకుంది కలహం. ఇక నాతోని వేసిగా వచ్చేసింది.

* * *

నేను ఇంటికి వచ్చాక విషయం తెలుసుకొని అమ్మా, నాన్న ఎంతో బాధ పడ్డారు. ఈ పరిణామంలో వారి పాలు ఎంతో వారికే తెలుసు. అందుకే ఏమనలేక పోయారు. ఆస్తితో మనుష్యుల్ని కొలవటం తప్పని, కేవలం డబ్బుతోనే మనుషులు సుఖపడలేరని వాళ్లకు తెలిసింది. గోపాలరావు వినయ విధేయతలకి సమయం మించిపోయిందిగా మరి? ఏమీ చెప్పలేక పోయారు నాకు.

నే వాళ్ళింట్లోనే అయితే ఏ సమస్యా ఉండక పోను. మా వివాహ ఫలితంగా మరో జీవి ఈ లోకంలోకి రాబోతోంది. ఆ ప్రాణి మగవాడైతే ఈ సమాజంలో భయం లేదు. ఆడదయితే మళ్లీ ఎన్నో సమస్యలు. ఇది అభివృద్ధి ఉన్నత యుగమైనా ఆడదాని సమస్యలు అలాగే ఉన్నాయి. కాకుంటే సమస్యల స్వరూపం మారిందంతే. అందువల్ల ఆ పుట్టబోయే ప్రాణి సమస్య ఏమవుతుందో మరి. ఇలా ఏదో ఆలోచిస్తూ కూర్చుంటానని అమ్మ ఏదో ఒకటి చెబుతూనే ఉంటుంది. ఇవాళా ఏదో చెబుతూ కూర్చుంది. నేను వచ్చి నెల రోజులు దాటినా గోపాలరావు మాస్టారు మా ఇంటికి రాలేదు. అమ్మ మాటల వల్ల ఆయన మేనల్లుని పెద్దపని ఏదో ఉన్న మనిషిగా హైదరాబాద్ వెళ్లారని తెలిసింది. ఇంకా ఏదో అమ్మ చెబుతుండగా సీతమ్మగారు మా ఇంటికి వచ్చారు.




# నోటి దుర్వాసన ఆపండి... కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో దంతక్షయాన్ని ఎదుర్కోండి

ప్రతిసారీ భోజనం చేసిన తర్వాత, కోల్గేట్‌తో మీ పళ్ళను తోముకోండి. కోల్గేట్, ప్రపంచమంతటా దంతవైద్యులు సిఫారసు చేసే తీరులో మీకు రక్షణ సమకూరుస్తుంది.

మీ పళ్ళలో మిగిలిపోయే ఆహారపు అణువులలో బాక్టీరియా పెరుగుతుంది. అవి ముందు నోటి దుర్వాసన, ఆ పైన బాధాకరమైన దంతక్షయాన్ని కలిగిస్తాయి

అందుకే మరి ఎప్పుడూ భోజనంకాగానే కోల్గేట్‌తో తోముకోవడం సరైన మార్గం. అది మీ శ్వాసను తాజాగా రూపొందించేందుకు, పళ్ళను తెల్లగా మెరిసేలా చేసేందుకు, దంతక్షయాన్ని ఎదిరించేందుకు అమోఘమైనదని రుజువయింది

కోల్గేట్ యొక్క నమ్మకమైన మాత్రీకరణ ఎలా పనిచేస్తుందంటే.




మీ పళ్ళలో ఇరుక్కుపోయిన ఆహారపు అణువులలో దుర్వాసన, దంతక్షయాన్ని కలిగించే బాక్టీరియా పెరుగుతుంది.

కోల్గేట్ యొక్క సాటిలేని ధర్మగుణ నురుగు బాగా లోతుల్లోని హానికరమైన ఆహారపు అణువులను బాక్టీరియాను తొలగిస్తుంది

ఫలితం: ఆకర్షణీయమైన తెల్లని పళ్ళు, శ్వాస తాజాగా ఉండడమే కాక, దంతక్షయం నుండి రక్షణ.

సాయినిగొల్పే, తాజా శ్వాసకోసం, పళ్ళను తెల్లగా రూపొందించేందుకు ప్రపంచంలో ఎక్కువమంది, మరే ఇతర టూత్‌పేస్ట్ కన్నా ఎక్కువగా కోల్గేట్‌నే కొంటూఉంటారు!




ఒక్క దంతవైద్యులు మాత్రమే దీనికన్నా మలైన దంతరక్షణ సమకూర్చగలరు

DC.G.62 TL

"ఏమ్మా, ఎలా ఉన్నావు?" అంటూ పలకరించారు. నా విషయం చెప్పాలా, వద్దా అని సందేహించాను. కానీ మాటల మధ్యలో అమ్మ చెప్పనే చెప్పింది. మనసులో బాధ ఎక్కువైనప్పుడు ఎలాగో దాన్ని బయటికి కక్కేయాలనిపించడం సహజమే.అన్నీ విని ఆవిడ నిట్టూర్చారు— "ఒకసారు ఇంటికి రామ్మా. గోపాలం ఈవాళే వచ్చాడు" అంటూ వెళ్ళారామె.

*     *     *

అవాళ సాయంత్రం గోపాలరావు మాస్టారింటికి వెళ్ళాను. మాస్టారుగారిని చూడగానే కన్నీళ్ళాగ లేదు.

"ఏమిటండీ, ఇలాగయిపోయా" రన్నాను.

"నీవూ ఇలాగయిపోయావేం?"

"నా సంగతి వేరు."

"నా సంగతీ ఆ 'వేరే' నని ఎందు కనుకోవు?"

ఉలిక్కి పడ్డాను. అంటే? ఇక్కడా అదే తతంగం నడుస్తూందా? గోపాలరావు మాస్టారు భార్యకూడా ఆయన్ని అనుమానిస్తూందా?అందుకేనా మాస్టారు చాలా నిర్లిప్తంగా దేనిమీదైనా ఆసక్తి, ఉత్సాహం కనపరచకుండా ఉన్నారు? సీతమ్మగారు నా కథ విని నిట్టూర్చింది ఇందుకేనా?

తేటు కొండీల్లా లక్ష ప్రశ్నలు తల ఎత్తాయి. ఇక వాళ్ళింట్లో కూర్చోలేక చెప్పకుండానే వచ్చేశాను ఇంటికి. ఇంకా నయం మాస్టారుగారి భార్య పుట్టింటి నుంచి ఇంకా రాలేదట. ఏవో నోములు నోచుకోడానికి వెళ్ళిందట.

ఆ తర్వాత సీతమ్మగారి వల్ల విషయమంతా తెలిసింది. మాస్టారు భార్య ఆయన్ను రోజూ వేధిస్తుందట!

"మీరు ఎదురింటమ్మాయిని ప్రేమించారుటగా? దాని ఫోటో పూజిం చేవారటగా? ఆవిడ గారి పెళ్ళికి అప్పు చేశారుటగా!"

మాస్టారు ఇప్పుడు దేనికీ సమాధానం చెప్పరట. అన్నిటికీ తలవొగ్గి జీవిస్తున్నారట.

"వాడు బ్రహ్మచారిగా ఉన్నా బాగుండేది, తల్లి, అనవసరంగా ఈ పెళ్ళి చేసి వాడి జీవితం నాశనం చేశాను" అంటూ సీతమ్మగారు దుఃఖించింది.

నేను ఆయనతో విడాకులకు సిద్ధంగా ఉన్నాను. ఆయనకూ అదే ఆలోచన ఉన్నట్టు తెలుస్తూనే ఉంది.

కానీ గోపాలరావు మాస్టారి సంగతి? ఆయన భార్య ఆయన్ని వదలి పోదు. ఆయన ఆమెను ఇంటి నుండి గెంటేయరు. భార్య భర్త జీవితాన్ని స్వర్గంగా మార్చగలదు. నరకమూ చేయగలదు. ఆ నరకంలోనే మాస్టారి జీవితం గడిచి పోతుందన్న మాట!!

'అయ్యో' అంటూ నా మనసు మూలిగింది. ఇక్కడ ఎవరు పొరపాటు చేశారో,ఎవరివల్ల ఎవరునాశనమయ్యారో అర్థం కావడం లేదు.

కష్టాల పట్టాలమీదనడిచే మా జీవితపు రైలు గమ్యం చేరేది ఎప్పటికో మరి?॥

*     *     *

నా గది కిటికీలో నుండి వీధిలోకి చూస్తూ కూర్చున్నాను. అప్పుడే గోపాలరావు మాస్టారు ఇల్లు మారుతున్నారు. ఆయన భార్య ఇల్లు మార్చి తీరాలని పేచీ పెట్టిందట. కాలేజీకి దూరమైనా మా ఇంటికి దూరంగా ఎక్కడో ఇల్లు కుదిర్చిందట ఆమె. అంతకు ముందే సీతమ్మగారు వచ్చి మాతో చెప్పి వెళ్ళింది. సామాన్లన్నీ చేరవేశారు. రిక్షాలో మాస్టారు, ఆయన భార్య కూర్చున్నారు. సీతమ్మగారు మరో రిక్షా ఎక్కారు. ఇంటికి తాళం వేసి ఆ తాళాలు నోనరు కిచ్చేశారు మాస్టారు. రిక్షాలు బయలు దేరాయి. ముందు సీతమ్మగారి రిక్షా, వెనుక మాస్టారుగారి రిక్షా.అలా చూస్తూ కూర్చున్నాను. రిక్షా మలుపు తిరిగింది.

"ఇల్లు అద్దెకిస్తారండీ?" ఎవరో అప్పుడే వచ్చి ఓనరును అడుగుతున్నారు.

"లేదండీ—ఇది అద్దెకివ్వం. సారీ!" ఓనరు సమాధానం.

కిటికీ తలుపులు మూసేసి, లోపలికి వచ్చాను.

ఇప్పుడు చెప్పండి మరి? పెళ్ళితో మా కథ ముగిసిపోయిందా? మొదలయిందా?॥

ఉంటాను,

కథానాయిక, సువర్ణ (జానకి)." *

# కళాకారులు



## భగవాన్ కపూర్

శ్రీ భగవాన్‌కపూర్ కరాచీ లోని సింధీ పరివారంలో జన్మించారు. దేశ విభజన తరవాత 1948 లో వీరి కుటుంబం బొంబాయి వచ్చింది. బాల్యం నుంచీ వీరికి చిత్రకళపై అభిరుచి ఉండేది. హైస్కూలు చదువు పూర్తి అయిన తరవాత వీరు బొంబాయి జె. జె. లో చిత్రకళాభ్యాసం చేసి ప్రథమ శ్రేణిలో డిప్లొమా తీసుకున్నారు. ఆ తరవాత ఫ్రాన్సు ప్రభుత్వం ఇచ్చిన ఉపకార వేతనంతో 1963 లో పారిస్ వెళ్ళారు.

మొదట్లో వీరు భారతీయ సంస్కృతికి సంబంధించిన చిత్రాలు, గ్రామీణ దృశ్యాలు చిత్రించే వారు. ఆ తరవాత వీరు అమూర్త శైలి వైపు ఆకర్షితు లయ్యారు.

అమెరికా మొదలైన పాశ్చాత్య దేశాలలో వీరు పర్యటించి ఉత్తమ కళాకారుల తోను, కళా ప్రవృత్తుల తోను పరిచయం సంపాదించారు.జీవితాన్ని స్పష్టంగా చూడాలని వీ రంటారు. దేశ విదేశాలలో ఎన్నో సార్లు వీరి చిత్రాలు ప్రదర్శిత మయ్యాయి. బహుమతులు, సన్మానాలు పొందారు. వీరు 1935 లో జన్మించారు.

—కాశిపు సోమరాజు

